క్లుప్తంగా

నాడు-నేడు పనులు సత్వరమే పూర్తిచేయాలి



నాడు-నేడు పనులపై సూచనలిస్తున్న అధికారులు

కరప: మండల పరిధిలో మనబడి నాడు-నేడు పథకంలో చేపట్టిన నిర్మాణ పనులు సత్వరమే పూర్తి చేయాలని సమగ్ర శిక్ష ఏఈఈ కె.వెంకట్రాజు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటుచేసిన సమావేశంలో వివిధ అంశాలపై సమీక్షించి పలు సూచనలు ఇచ్చారు. నాడు-నేడు రెండో విడత నిధులతో పాటు, మొదటి విడత పాఠశాలల్లో మిగిలిపోయిన పనులకు కూడా నిధులు మంజూరయ్యాయని, ఆయా పాఠశాలల్లో నిర్దేశించిన పనులు సత్వరమే పూర్తిచేయించాలన్నారు. పాఠశాల వారీగా జరుగుతున్న పనులను సమీక్షించారు. ఎంఈఓ-1 కె.బుల్లికృష్ణవేణి మాట్లాడుతూ జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ, విద్యా సంవత్సరంలో అనుసరించాల్సిన విధి, విధానాలను వివరించి అవగాహన కల్పించారు. ఎంఈఓ-2 ప్రత్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

డ్రోన్ ద్వారా భూముల రీ సర్వే

- నిర్వహణకు తొమ్మిది బృందాలు
- కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్



మాట్లాడుతున్న కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల

కాకినాడ: జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకం కింద భూముల సమగ్ర సర్వేను డ్రోన్ ద్వారా నిర్వహిస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రావిరాల చెప్పారు. స్థానిక స్మార్ట్ సిటీ కార్యాలయంలో ఈ అంశంపై సచివాలయ కార్యదర్శులు, సంబంధిత సిబ్బందితో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరిహద్దులను నిర్ధారించే ప్రక్రియను రోవర్ ద్వారా చేపడతామన్నారు. ఇందుకోసం తొమ్మిది బృందాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఆయా బృందాలు 15 రోజుల్లో ప్రక్రియ పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగళ్ళస్తులు, టౌన్ సర్వేయర్ ఆచారి, సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

సీఎస్సార్ నిధులతో మరిన్ని సేవలు



దేవి ఫిషరీస్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ యార్లగడ్డ వీర్రాజును సత్కరిస్తున్న రోటరీ సభ్యులు

బోట్‌క్లబ్: కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్సార్) నిధుల ద్వారా సమాజానికి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు అవకాశం ఉంటుందని రోటరీ గోల్డెన్ జూబ్లీక్లబ్ అధ్యక్షులు జీవీ కృష్ణప్రకాష్ అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న రోటరీ బ్లడ్‌బ్యాంక్‌కు దేవి ఫిషరీస్ సీఎస్సార్ నిధులు రూ.22 లక్షలు అందజేసిన సందర్భంగా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ యార్లగడ్డ వీర్రాజును ఆయన చాంబర్‌లో గురువారం సత్కరించి , జ్ఞాపిక అందించారు. ఈ ఏడాది కాకినాడ సీపోర్టు, దేవి ఫిషరీస్, విజన్ ప్రాజెక్టు తదితర సంస్థల నుంచి రూ.56 లక్షలు సమీకరించామన్నారు. క్లబ్ కార్యదర్శి వడ్డాది ఆదిత్య, బ్లడ్ బ్యాంక్ చైర్మన్ టీవీ బాలకృష్ణ, కార్యదర్శి చారిత్నార్ వర్మ పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయం



విద్యార్థులను అభినందిస్తున్న లయన్స్ గవర్నర్ మంగతాయారు

కాకినాడ రూరల్: ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను ప్రోత్సహించడానికి వారిని సత్కరించి, నగదు బహుమతి అందజేయడం అభినందనీయమని లయన్స్ గవర్నర్ ఎం.మంగతాయారు పేర్కొన్నారు. రమణయ్యపేట ఆశ్రమ శ్రావణి వృద్ధాశ్రమంలో క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను ఘనంగా సత్కరించి, నగదు బహుమతిని అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన లయన్స్ గవర్నర్ మాట్లాడుతూ మహిళ విద్యావంతురాలైతే ఆ కుటుంబమంతా ఉన్నత చదువులతో ఆర్థికంగా పటిష్టమవుతుందన్నారు. క్లబ్ కార్యదర్శి లయన్ నాగిరెడ్డి లక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ టీసీ చంద్రగుప్త, శ్రీదేవి రెడ్డి పాల్గొన్నారు.

ముంపు లేకుండా.. మురుగుపోయేలా..

- వర్షాకాలం సమస్యలకు చెక్
- కాల్వలు, డ్రైన్లలో చురుగ్గా పూడికతీత



రమణయ్యపేటలో మురుగు కాల్వలో పూడిక తీత పనులు

కాకినాడ రూరల్: వేసవి ముగిసింది. నైరుతి రుతు పవనాలతో వాతావరణం చల్లబడుతోంది. వానాకాలం వచ్చేస్తోంది. కాకినాడ, పరిసర ప్రాంత గ్రామాలు సముద్ర తీరానికి ఆనుకుని ఉండడంతో తుఫాన్ల సమయంలో వర్షపు, వరద నీరు సముద్రంలోకి వెళ్లేందుకు చాలా సమయం పడుతోంది. ముఖ్యంగా అమావాస్య, పౌర్ణమి సమయాలలో ఆటుపోట్ల వల్ల కాకినాడ, పరిసర గ్రామాల్లో వర్షపు నీరు, కాల్వలు, డ్రైనేజీల్లో మురుగునీరు నిలచిపోయి దుర్గంధం వెదజల్లడం ఏళ్ల తరబడి సమస్య. నేడు ఆ పరిస్థితి లేదు. అడపాదడపా వర్షాలు ప్రారంభమతున్నందున అధికార యంత్రాంగం మేల్కొంది. రమణయ్యపేటలో రాజీవ్‌గాంధీ లా కళాశాల పై ప్రాంతం నుంచి పిఠాపురం రోడ్డును క్రాస్ చేసుకుని ఏపీఐఐసీ కాలనీని ఆనుకుని రమణయ్యపేట గ్రామంలో విస్తరించి ఉన్న మురుగు కాల్వకు గ్రామ పంచాయతీ అధికారులు మోక్షం కల్పించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదేశాలతో సుమారు రూ.3లక్షల నిధులతో పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, సిబ్బంది పూడిక తీయించారు. మరోవైపు గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బంది డ్రైనేజీలలో పూడిక తీత చేపడుతూ శుభ్రం చేస్తున్నారు. మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉండగా వీటిలో రమణయ్యపేటతో పాటు మేజర్‌గా వాకలపూడి, వలసపాకల, ఇంద్రపాలెం, తూరంగి, చీడిగ తదితర గ్రామాలలో ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో మురుగు సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.



మురుగు కాల్వలో పూడిక తీతతో వచ్చిన మట్టి, ప్లాస్టిక్ వ్యర్థాలు

మెరుగైన పారిశుధ్యానికి చర్యలు



వర్షాకాలం వచ్చిందంటే పారిశుధ్యమే ప్రధాన సమస్య. మెరుగైన శుభ్రత కోసం గ్రామ పంచాయతీ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చాం. ముఖ్యంగా డ్రైనేజీలు మురుగుతో నిండిపోకుండా పూడిక తీత చేపడుతున్నాం.

– కర్రే స్వప్న, ఎంపీడీఓ కాకినాడ రూరల్

వినూత్న పథకం జగనన్న సురక్ష

- ప్రజలకు ఎంతో ప్రయోజనం
- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతనంగా అమలు చేస్తున్న 'జగనన్న సురక్ష ' దేశ చరిత్రలోనే వినూత్న పథకమని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అందకపోయినా, జనన, మరణ, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అవసరమైనా, ఆధార్‌తో అనుసంధానం చేయాలన్నా, మరే ఇతర సేవలనైనా జగనన్న సురక్ష పథకం ద్వారా సులభంగా పొందే అవకాశం ఉంటుందన్నారు.

అర్హులందరికీ పథకాలు అందాలనే లక్ష్యంతో పాటు ఇతర సేవలను కూడా సులభంగా అందించాలనే లక్ష్యంతో ఈ విధానాన్ని ప్రారంభించారన్నారు. జూలై 1వ తేదీ నుంచి వలంటీర్లు, గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి అక్కడి సమస్యలు, అవసరాలను తెలుసుకుని ఒక టోకెన్ నెంబర్ ఇచ్చి యాప్‌లో నమోదు చేస్తారన్నారు. సమస్యలన్నీ తెలుసుకున్నాక మెగా మేళా నిర్వహించి గుర్తించిన ప్రతి సమస్యను పరిష్కరించి, అర్హులందరికీ పథకాలు ఇస్తారన్నారు. నెల రోజులపాటు జరిగే ఈ ప్రక్రియకు త్వరలోనే ఏఏ డివిజన్లలో సర్వే ప్రక్రియ జరుగుతుందో ప్రకటిస్తామన్నారు. గతంలో జరిగిన సాధికార సర్వే వల్ల ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను కూడా అధిగమించి ఈ సర్వేలో పరిష్కరిస్తామన్నారు. రోజుకు రెండుమూడు డివిజన్లలో సర్వే ప్రక్రియ జరుగుతుందన్నారు.

తనపై పోటీ చేయాలని పవన్‌కల్యాణ్‌కు చేసిన సవాల్‌పై జనసేన నాయకులు పంతం నానాజీ, ముత్తా శశిధర్, సరోజ ప్రతిస్పందన తీరు హాస్యాస్పదంగా ఉందన్నారు. పవన్‌కల్యాణ్ పర్యటనలో స్థానిక నేతలను కనీసం పక్కన పెట్టుకుని ప్రజలకు పరిచయం కూడా చేయలేకపోయారని, అక్కడే ఈ నాయకులకు జనసేనలో ఉన్న 'స్థానం' ఏమిటో అర్థమవుతుందన్నారు. అలాంటి వ్యక్తులు తనను విమర్శించడానికి ఏ మాత్రం సరిపోరాన్నారు.

ముద్రగడపై స్థాయికి మించి విమర్శలు తగదు

- నానాజీ వ్యాఖ్యలపై కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి, నేతల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రకళాదీప్తి. చిత్రంలో మాజీ మేయర్ శివప్రసన్న తదితరులు

కాకినాడ: ఉన్నత వ్యక్తిత్వం కలిగిన కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభంపై జనసేన పీఏసీ సభ్యుడు పంతం నానాజీ స్థాయిని మరిచి విమర్శలు చేయడం సరికాదని కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, పలువురు నేతలు హితవు పలికారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కాపు ఉద్యమ సమయంలో ముద్రగడ పెట్టిన ఉప్మా తిన్నాను. ఆ ఉప్మా ఖరీదును మనియార్డర్ చేస్తున్నానంటూ పంతం నానాజీ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. పంతం వారి కుటుంబానికి చెందిన కాపు మహిళగా చెబుతున్నా మీది ఉప్మాతినే స్థాయే తప్ప తిరిగి ఇచ్చే స్థాయి లేదు. కులం కోసం ఎన్నో త్యాగాలు చేసిన ముద్రగడ వంటి పెద్దమనిషిని విమర్శించడం మంచిది కాదని విమర్శించారు. ద్వారంపూడి కుటుంబ వ్యక్తిత్వం తెలిసిన వ్యక్తిగా ముద్రగడ తన అభిప్రాయాన్ని చెప్పారన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకులు రాజారపు కృష్ణ మాట్లాడుతూ రాజకీయాల్లో ఉన్నప్పుడు ఏదైనా విమర్శ చేసేటప్పుడు స్థాయిని తెలుసుకుని మాట్లాడాలని, కాపుల్లో 'ఐకాన్'గా పిలవబడే 'ముద్రగడ'ను విమర్శించడం నానాజీకి తగదన్నారు. ఎన్‌వీ సాయిబాబా, వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు గంగాపాత్రుని శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ బెండా విష్ణు, సూపర్‌బజార్ చైర్మన్ ముమ్మిడి గోవిందు, పోస్క మిటీ సభ్యురాలు కృష్ణప్రియ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సుంకర జన్మదిన వేడుక



శివప్రసన్నకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి, చంద్రకళాదీప్తి తదితరులు

కాకినాడ: వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న జన్మదినం సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం కేక్‌కట్ చేశారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మితో పాటు నాయకులు, కార్యకర్తలు, మాజీ కార్పొరేటర్లు, అభిమానులు ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

రేపు స్వరాగ మాల సంగీత కచేరీ



స్వరాగ మాల సంగీత కచేరీ రిహార్సిల్స్‌ను ప్రారంభిస్తున్న వేదిక అధ్యక్షురాలు సత్యభామ

కాకినాడ కల్చరల్: స్థానిక సూర్యకళామందిర్‌లో ప్రపంచ సంగీత దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సాయంత్రం ఆరు గంటలకు స్వరాగ మాల సంగీత కచేరీ నిర్వహించనున్నట్టు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్మారక కళావేదిక అధ్యక్షురాలు రాయవరపు సత్యభామ తెలిపారు. ఈ మేరకు స్థానిక దంటు కళాక్షేత్రంలో సంగీత కచేరీకి గురువారం సాధన ప్రారంభించారు. సంగీత కళాకారులను ప్రోత్సహించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని కళావేదిక వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి డి.రామ్‌రాజ్ అన్నారు. వేదిక ఉపాధ్యక్షుడు తిరుమలరావు, సహాయ కార్యదర్శి ఎం.భాస్కర్, కోశాధికారి జె.సాల్మన్‌రాజు, రామారావు, బాబి తదితరులు పాల్గొన్నారు.

29 నుంచి బాబా ఆలయ రజతోత్సవాలు

బోట్‌క్లబ్: స్థానిక రిజర్వ్ పోలీస్‌లైన్‌లోని అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సాయిబాబా వారి 25వ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఈ నెల 29, 30, జులై 1న వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇన్‌చార్జి గోపాలకృష్ణ తెలిపారు. ఆలయ ప్రాంగణంలో గురువారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

కరప: మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. పేపకాయలపాలెం, గురజనాపల్లి, ఉప్పలంక, గొర్రిపూడి గ్రామాల్లో తాగునీరందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండలపరిషత్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తర్వాత పోస్టాఫీసుకు వెళ్లి కాపు ఉద్యమంలో ఉప్మాకు ఖర్చుపెట్టిన సొమ్ములు తిరిగి చెల్లిస్తున్నామంటూ ఒక్కొక్కరు రూ.100, 50, 20, 10 వంతున ఉద్యమనేత ముద్రగడ పద్మనాభానికి మనీ ఆర్డరు చేశారు.

కనకదుర్గమ్మ ఆలయంలో చోరీ

కాకినాడ రూరల్: ఇంద్రపాలెం రజకపేటలో కనక దుర్గమ్మ ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం రాత్రి సమయంలో ఇద్దరు వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి హుండీలోని డబ్బును దొంగిలించారు. ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై నాగరాజు తెలిపారు. ఆలయంలోని సీసీ పుటేజిని పరిశీలిస్తున్నామని, నిందితులు సీసీ పుటేజీలో కనిపిస్తున్నారన్నారు.

విత్తన దుకాణాలపై విజిలెన్స్ దాడులు

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ పరిధిలోని విత్తన దుకాణాలపై గురువారం విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. విజిలెన్స్ డీఎస్పీ నాయుడు, సీఐ శ్రీనివాసరెడ్డి, విజిలెన్స్ వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, మండల వ్యవసాయశాఖ అధికారి సత్యనారాయణ తదితరులు గొల్లప్రోలులోని ప్రవంతి ఆగ్రో ఏజెన్సీస్‌లో తనిఖీలు చేశారు. గొడౌన్‌లో ఉన్న లాట్‌కు ఇన్వాయిస్ లేకపోవడంతో రూ.82,741 విలువైన 87 ప్యాకెట్ల అమ్మకాలను నిలిపివేశారు. మిగిలిన విత్తనాలకు రికార్డులు సక్రమంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు.

నాడు-నేడు పనులు సత్వరమే పూర్తిచేయాలి



నాడు-నేడు పనులపై సూచనలిస్తున్న అధికారులు

కరప: మండల పరిధిలో మనబడి నాడు-నేడు పథకంలో చేపట్టిన నిర్మాణ పనులు సత్వరమే పూర్తి చేయాలని సమగ్ర శిక్ష ఏఈఈ కె.వెంకట్రాజు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో గురువారం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఏర్పాటుచేసిన సమావేశంలో వివిధ అంశాలపై సమీక్షించి పలు సూచనలు ఇచ్చారు. నాడు-నేడు రెండో విడత నిధులతో పాటు, మొదటి విడత పాఠశాలల్లో మిగిలిపోయిన పనులకు కూడా నిధులు మంజూరయ్యాయని, ఆయా పాఠశాలల్లో నిర్దేశించిన పనులు సత్వరమే పూర్తిచేయించాలన్నారు. పాఠశాల వారీగా జరుగుతున్న పనులను సమీక్షించారు. ఎంఈఓ-1 కె.బుల్లికృష్ణవేణి మాట్లాడుతూ జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ, విద్యా సంవత్సరంలో అనుసరించాల్సిన విధి, విధానాలను వివరించి అవగాహన కల్పించారు. ఎంఈఓ-2 ప్రత్తి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రగతికి కష్టించి పనిచేయండి

- విజయవాడ జోన్ ఈడీ గోపీనాథ్‌రెడ్డి
- ఉద్యోగులకు ప్రోత్సాహకాల అందజేత



ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న విజయవాడ జోన్ ఈడీ గోపీనాథ్‌రెడ్డి

కాకినాడ: ప్రతి ఉద్యోగి మరింత కష్టించి పనిచేసి ప్రయాణికుల మన్ననలు పొందాలని ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.గోపీనాథ్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన కాకినాడ ఆర్టీసీ డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా డిపోలో ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారికి ప్రశంసాపత్రాలు, నగదు అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ లాభాల బాటలో పయనించేలా ప్రతి ఉద్యోగి మరింత అంకిత భావంతో కష్టపడి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు, డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్, ఆర్టీసీ అధికారులు వి.రవిశంకర్, కె.ప్రభాకరరావు, కె.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కటౌట్



రోడ్డు మీదకు ఒరిగిన కటౌట్

కాకినాడ క్రైం: భానుగుడి కూడలి సమీపంలో టూటౌన్ వంతెన నుంచి భానుగుడికి చేరే మలుపులో కొద్ది రోజుల క్రితం ఓ హీరో కటౌట్ ఏర్పాటు చేశారు. కర్రల ఆధారంతో ఏర్పాటు చేసిన ఆ కటౌట్ బుధవారం రాత్రి రోడ్డు మీదికి ఒరిగిపోయింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డుపై కటౌట్ ఏ సమయంలోనైనా వాలిపోయి వాహనచోదకులు, పాదచారులపై పడి గాయపడే ప్రమాదం ఉంది. ట్రాఫిక్ పోలీసులు లేదా, పట్టణ ప్రణాళిక అధికారులు ఈ కటౌట్‌ను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

క్రీడా సామగ్రి బహూకరణ



విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న డాక్టర్ సునీత

కరప: మండలం గురజనాపల్లిలోని పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాలకు గురువారం అదే గ్రామంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో పనిచేస్తున్న డాక్టర్ బి.సునీత క్రీడా సామగ్రిని అందజేశారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని ఈ స్థితిలో ఉన్నానని, విద్యార్థులతో చదువుతోపాటు ఆటలకు కూడా ప్రాధాన్యం ఇచ్చి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డాక్టర్ సునీత ఆకాంక్షించారు. హెచ్‌ఎం ఎం.సాయిమోహన్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు కె.నాగలింగేశ్వరరావు, వీవీ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగు పెంచాలి



నర్సరీని పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖాధికారి మల్లికార్జునరావు

పెద్దాపురం: జిల్లాలో ఉద్యాన పంటల సాగు విస్తీర్ణం పెంపొందించేందుకు రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా ఉద్యానశాఖాధికారి ఎస్ మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని వాలు తిమ్మాపురం, ఆర్‌బి పట్నం గ్రామాల్లో గురువారం ఉద్యాన పంటలను సందర్శించారు. ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను, కోల్డ్ స్టోరేజి, కలెక్షన్ సెంటర్, పతంజలి ఫుడ్స్ ఆయిల్ పామ్ పరిశ్రమలో ఉన్న ఆయిల్‌పామ్ నర్సరీలను ఆయన పరిశీలించారు. 12 నెలల వయసు దాటిన నాణ్యమైన పామాయిల్ మొక్కలను మాత్రమే రైతులకు పంపిణీ చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. ఏపీఎఫ్‌పీఎస్ ద్వారా 35 శాతం సబ్సిడీపై చిన్న తరహా కుటీర పరిశ్రమలకు అందించే ప్రోత్సాహకాలను ఆసక్తి కలిగిన రైతులకు అందించేందుకు చర్యలు తీసుకోవాలని మల్లికార్జునరావు సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఓ నూనె సుజాత, వీహెచ్‌ఏ ఎం.చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటితో కైలాసభూమి నిర్మాణం

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- రూ.4 లక్షల విరాళం ప్రకటన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్

అన్నవరం: గ్రామంలో రూ.కోటితో కై లాసభూమి (హిందూ శ్మశానవాటిక) నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ తెలిపారు. స్థానిక సత్యగణపతి వర్తకసంఘం కల్యాణ మండపంలో గురువారం సర్పంచ్ ఎస్.కుమార్ రాజా అధ్యక్షత శ్మశానవాటిక నిర్మాణంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్తుల కోరిక మేరకు గత మూడేళ్లగా శ్మశానవాటికకు స్థలం కోసం ప్రయత్నాలు చేశామన్నారు. చివరకు సర్వే నంబర్ 76లో దాత జంపన కేశవరాజుకు చెందిన 1.20 ఎకరాల స్థలాన్ని శ్మశానవాటికకు కేటాయించినట్టు తెలిపారు. ఈ స్థలంలో ఎంపీ గ్రాంట్, ఎమ్మెల్యే గ్రాంట్, మండల పరిషత్, పంచాయతీ నిధులతో పాటు గ్రామస్తుల విరాళాలతో శ్మశానవాటిక నిర్మిస్తామని తెలిపారు. అలాగే దాతలతో మాట్లాడి మృతదేహాలను శ్మశానవాటికకు తరలించేందుకు 'కైలాసరథం' కూడా సమకూర్చుతానని చెప్పారు. శ్మశానవాటిక నిర్మాణానికి ఎమ్మెల్యే రూ.4 లక్షల విరాళాన్ని ప్రకటించారు.

వ్రతపురోహిత సంఘం రూ.10 లక్షల విరాళం

శ్మశానవాటిక నిర్మాణానికి అన్నవరం దేవస్థానం వ్రతపురోహిత సంఘం రూ.10 లక్షలు విరాళం ప్రకటించింది. ఈ మేరకు సంఘ గౌరవాధ్యక్షుడు నాగాభట్ల కామేశ్వరశర్మ సమావేశంలో ప్రకటించారు. సత్యదేవ బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రం అధ్యక్షుడి హోదాలో రూ.1,01,116 విరాళాన్ని కామేశ్వరశర్మ ప్రకటించారు. మాజీ ఉపసర్పంచ్ పెద్దింటి నారాయణరావు తన వంతుగా శ్మశానవాటికలో ఒక శవదహన బెడ్ నిర్మాణానికి విరాళాన్ని ప్రకటించారు. సమావేశంలో శంఖవరం ఎంపీపీ పర్వత రాజబాబు, వైస్ ఎంపీపీ ధారా వేంకట రమణ, రోటరీ క్లబ్ అధ్యక్షుడు రమణమూర్తి, వెంకట్, పెన్షనర్స్ సంఘ అధ్యక్షుడు కందర్ప సత్యనారాయణ మూర్తి, అన్నవరం ఉపసర్పంచ్ బొబ్బిలి వెంకన్నబాబు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు 'యాసలపు'



యాసలపు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెద్దాపురం: ఉద్యమకారులకు ఆదర్శప్రాయులు యాసలపు సూర్యారావు అని సీపీఎం మాజీ ఎంపీ పి.మధు, సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ అన్నారు. సూర్యారావు 11వ వర్ధంతి సందర్భంగా స్థానిక వరహాలయ్యపేటలోని సూర్యారావు భవనం వద్ద గురువారం నీలపాల సూరిబాబు అధ్యక్షతన వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విలువలతో రాజీ పడకుండా ప్రజా నాయకుడిగా ఆయన చేసిన సేవలు ఎనలేనివన్నారు. పార్టీలకు అతీతంగా ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ఆయన చూపిన చొరవ, పట్టుదల మరువలేనివన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి దువ్వా శేషుబాబ్జి, కరణం ప్రసాదరావు, సాహితి స్రవంతి గౌరవాధ్యక్షుడు చల్లా విశ్వనాథం మాట్లాడుతూ యువతకు స్ఫూర్తినిచ్చిన నాయకుడు యాసలపు సూర్యారావు అన్నారు. తొలుత యాసలపు చిత్రపటానికి పూలమాలల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తొమ్మిదేళ్ల బీజేపీ పాలన తీరుతెన్నులు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సిరిపురపు శ్రీనివాస్, ఐద్వా నాయకులు కూనిరెడ్డి అరుణ, దాడి బేబీ, దారపురెడ్డి కృష్ణ, కేదారి నాగు, పలివెల వీరబాబు, కరణం శ్రీనివాస్, యాసలపు రమేష్, మాగాపు నాగు తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

జగ్గంపేట: గ్రామ శివారు పోలవరం గట్టు సమీపంలో పేకాట శిబిరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి రూ.2800 స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. నిందితులను శుక్రవారం కోర్టులో హాజరు పరుస్తామని చెప్పారు.

